క్లుప్తంగా

వేగంగా పైపులైన్ మరమ్మతు పనులు



పైపులైన్ మరమ్మతు పనులు చేపిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో పైపులైన్ల మరమ్మతు పనులు చురుగ్గా చేపట్టినట్లు సర్పంచ్ జీనత్‌షఫీ తెలిపారు. స్థానిక కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ సంపు నుంచి చిత్తూరు రోడ్డు మీదుగా బండ్లవంకకు వెలుతున్న పైపులైన్లు పలు చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో లీకేజీ సమస్యను పరిష్కరించి బండ్లవంక, కోటపల్లె రోడ్డు, గంగమ్మ గుడి వీధి, రాములవారి వీధి తదితర ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతికి నివాళి



రాజునాయక్ (ఫైల్)

పీలేరురూరల్ : గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద పంచాయతీ రెడ్డిమాణ్య తాండాకు చెందిన ఎం. రాజునాయక్ (54) పీలేరు పట్టణం కావలిపల్లెలో కాపురం ఉంటూ గత 30 సంవత్సరాలుగా పీలేరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటు రావడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎం కుమార్ తోపాటు పలువురు యూనియన్ నాయకులు నివాళులర్పించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కేవీపల్లి : ఝరికోన ప్రాజెక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు వేతనాల తోపాటు ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఝరికోన ప్రాజెక్టులో ఆపరేటర్లు, రూట్ వర్క్ కార్మికులు దాదాపు 40 మంది ఉన్నారని, వారికి నెలనెలా జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

డయేరియాతో బెంబేలు



డయేరియాతో ప్రభుత్వాసుపత్రిలో చేరిన రోగులు

వాల్మీకిపురం : పట్టణ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు డయేరియా సమస్యతో బెంబేలెత్తిపోతున్నారు. బుధవారం దాదాపు 20 మందికిపైగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వీరికి ప్రభుత్వాసుపత్రి వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఉత్తమ, మహమ్మద్, లక్ష్మిదేవి, నరసింహులు, సాయినాథ్, మురారి, షాహీర్ బాష, ఫాతిమాబి తదితరులు డయేరియాతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బాధితులు కోరుతున్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ఐబీటీ ఎదురుగా ఉన్న పాత కళాశాల మైదానంలో జూలై 1వతేదీ సోమవారం మదనపల్లె వెంకటేశ్వర హార్ట్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వారు ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్‌లకు ఉచితంగా పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. గుండె, ఆస్తమా, శ్వాసకోశ అలర్జీ, థైరాయిడ్ వంటి జబ్బులకు పరీక్షలతో వైద్య చికిత్స అందిస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్

వాల్మీకిపురం : రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని మదనపల్లి ఏడీఏ శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లు, స్టాకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ ఫారం లేకుండా ఎటువంటి స్టాకు అమ్మరాదని, రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఎటువంటి పొరపాట్లు జరిగినా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమలత, ఏఈవో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజంపేట రూరల్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి బుధవారం మండల పరిధిలోని సీతారామపురం గ్రామంను సందర్శించారు. ఆ గ్రామంలోని ప్రజలను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

యువత మత్తుకు బానిస కావద్దు

డీఎస్పీ ప్రసాదరెడ్డి



మదనపల్లెలోని బెంగుళూరు బస్టాండులో పోలీసులు, విద్యార్థులు, పోర్డ్ సభ్యుల ర్యాలీ

మదనపల్లె : మత్తు పదార్థాల నివారణతో పాటు యువత మత్తుకు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని డీఎస్పీ ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీని ఆర్టీసీ-1 డిపో ఆవరణలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని సీటీఎం రోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, అవెన్యూరోడ్డు మీదుగా బెంగళూరు బస్టాండుకు చేరుకుంది. విద్యార్థులతో పాటు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రాణాంతకమని, మారుతున్న జీవనపరిస్థితులు, ఆర్థిక సమస్యలతో అనేకమంది విద్యార్థులు, యువత మత్తు బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. అనంతరం పోలీస్, ఎక్సైజ్ అధికారులు వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు తీసుకోవడంతో అనేక మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణకు, యువత వాటి బారిన పడకుండా వివిధ శాఖల సమన్వయంతో కఠినచర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో సీఐలు యువరాజు, వలీబాషు, ఎన్.శేఖర్, ఎస్ఈబీ ఎస్ఐ జయసింహ, నవీన్, పోర్డ్ జల్లాలలితమ్మ, ధాత్రి స్వాతి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు మానుకోండి..జీవితాలు సరిదిద్దుకోండి

పీలేరు రూరల్ : మత్తు పదార్థాలు తయారీ చేయడం, సేవించడం మానుకుని తమ జీవితాలు సరిదిద్దుకోవాలని రాయచోటి ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పీలేరు పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి క్రాస్ రోడ్డువరకు ప్రపంచమాదక ద్రవ్యాల దుర్వినియోగం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ పూర్తిగా మనుకోవాలన్నారు. సారా సేవించడం ద్వారా అనారోగ్యానికి గురై కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని తెలిపారు. సారా తయారీ చేయడం మానుకుని జీవితాలు సరిదిద్దుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. సమష్టి కృషితో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, సెబ్ సీఐ శ్యాంప్రసాద్, ఎస్ఐలు నరసింహుడు, రమణ, లక్ష్మీనరసయ్య, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

ములకలచెరువు : అంతర్జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, డ్రగ్స్ బారిన పడి జీవితాలు ఛిన్నాభిన్నం చేసుకోరాదని హితబోధ చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌ను అంతం చేద్దామని నినాదాలు చేసారు. సివిల్ సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఈబీ సీఐ రాంమోహన్‌తో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు.



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు



ములకలచెరువులో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మానవహారం

ఘనంగా కల్యాణ వెంకటేశ్వర స్వామి దోపోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

రామసముద్రం : రామసముద్రం మండలం మినికి గ్రామంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఘనంగా దోపోత్సవం నిర్వహించారు. ఉదయం వేద పండితులచే వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చన నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించి దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహించి, పుష్పపల్లకిపై ఊరేగించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయం వద్ద పౌరాణిక నాటకం నిర్వహించారు.

విద్యార్థులకు స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

పీలేరు : స్థానిక భువన విద్యాలయంలో విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ నిర్వహించారు. హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి. చిన్నరెడ్డి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ప్రిన్సిపాల్ గుణలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యం తోపాటు మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ఇందులో శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు పదో తరగతి అనంతరం రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకరమంలో కరస్పాండెంట్ ఉమారమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరపర్తి ఆశ్రమంలో చిన్నారులకు ఉచిత రక్తవర్గీకరణ



చిన్నారులకు బ్లడ్‌గ్రూపింగ్ చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

మదనపల్లె సిటీ : స్థానిక బసినికొండ వద్దనున్న కూరపర్తి ఆశ్రమంలోని చిన్నారులకు మంగళవారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తవర్గీకరణ నిర్వహించారు. సుమారు వంద మంది చిన్నారులను రక్తవర్గీకరణ చేశారు. ప్రతి ఒక్కరూ రక్తవర్గీకరణ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలన్నారు. రక్తగ్రూపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సాయిచైతన్య ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు రమణ, నాగార్జున, అమరావతి, సుగుణ హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ నూతన కార్యవర్గం

బి.కొత్తకోట : విద్యార్థి జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షునిగా గణే ష్‌రాజు, గౌరవాధ్యక్షుడిగా సిద్దు, ఉపాధ్యక్షుడిగా ఎం.ధనుష్, కార్యవర్గ సభ్యులుగా రామ్‌చరణ్, మంజునాథ్, అక్షయ్‌కుమార్, అరవింద్, మస్తాన్, ఆషిఫ్ బాషా, సంతోష్, అమరనారాయణ, రాకేష్, గణేష్, కిరణ్‌కుమార్, వర్ధన్, బద్రీనాథ్, విజయభాస్కర్, రిషికేశవ, శివకుమార్‌లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంగరాజు తెలిపారు.

వైభవంగా కోటకొండ గంగమ్మ జాతర



గంగమ్మ తల్లికి బోనాలు తీసుకెలుతున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె సమీపంలోని వారపుసంత తోపులో వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం వైభవంగా జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ అమ్మవారికి దీలు, బోనాలు, సారె ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందినీ బండ్ల మెరవణి భక్తులను అలరింపజేశాయి.

ప్రత్యేక హోదాపై ఉద్యమం

విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న

బి.కొత్తకోట : ప్రత్యేకహోదా ఉద్యమం చేపట్టేందుకు విద్యార్థులు, యువతను సన్నద్ధం చేస్తున్నట్లు విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.ఉత్తన్న అన్నారు. బుధవారం బి.కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు గంగరాజుతో కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గ జేఏసీ కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన కోసం మరోసారి ఉద్యమం చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. హోదా వస్తే పరిశ్రమలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు వస్తాయన్నారు. గతంలో విశ్వవిద్యాలయను కేంద్రంగా చేసుకుని ప్రత్యేక హోదా కోసం ఉద్యమించామని గుర్తుచేశారు. మళ్లీ మరోసారి ఈ ఉద్యమం చేపడుతున్నట్టు చెప్పారు. దీనికోసం జేఏసీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. కమిటీలను పునర్వ్యవస్థీకరించి ఉద్యమానికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కమిటీల ఏర్పాటు పూర్తయ్యాక ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

ఆలయ మాన్యం భూముల పరిరక్షణకు చర్యలు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



బసినికొండ బైపాస్‌రోడ్డులో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని మేదరవీధి ఆంజనేయ స్వామి ఆలయ మాన్యం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలో అడిక్ట్ హోటల్ పక్కన ఉన్నటువంటి ఆంజనేయ స్వామి ఆలయ మాన్యం భూములను ఆయన పరిశీలించారు. పట్టణ నడిబొడ్డున దాదాపు 1.50 ఎకరాల కోట్ల రూపాయల విలువైన స్థలం వృథాగా ఉండటమే కాకుండా ఆక్రమణలకు గురవుతుండటంతో, తక్షణం రక్షణకు చర్యలు తీసుకోవాల్సిందిగా రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. ఆలయమాన్యం భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి, ఎండోమెంట్‌శాఖ ఆధ్వర్యంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, మాల్ నిర్మాణం జరిపేందుకు ప్రతిపాదనలు, యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తామన్నారు. మదనపల్లె పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.500 కోట్లతో ప్యాకేజీ మంజూరు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. దీంతో పట్టణంలో పలుచోట్ల ఫ్లైఓవర్‌ల నిర్మాణం చేపట్టి, పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలుస్వామి, రాటకొండనవీన్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనుల పరిశీలన : కొండామారిపల్లె బైపాస్‌రోడ్డు వద్ద భూవివాదం కారణంగా నిలిచిపోయిన సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఈ శ్రావణి, ఏఈ శిరీషలను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2016–17 అమృత్ పథకంలో భాగంగా రూ.15.19 కోట్లతో, తిరుపతి పబ్లిక్‌హెల్త్ అధికారుల పర్యవేక్షణలో 10శాతం మేర నిర్మాణపనులు జరిగినట్లు ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. అనంతరం టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ సమీపంలో పెద్ద డ్రెయిన్‌ను పరిశీలించి, రోడ్డుకు క్రాస్‌గా కాకుండా, నేరుగా కురవంకకు కలిపేలా డిజైన్‌ప్లాన్ తయారుచేయాలన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ నాటక ఘట్టం



దుర్యోధన వధ ఘట్టంలో వేషదారులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా దుర్యోధన వధ నాటక ఘట్టం ఆకట్టుకుంది. గత 18 రోజులుగా నిర్వహించిన పంచమవేద మహాభారత యజ్ఞం బుధవారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. మహాభారత యజ్ఞం వద్ద మట్టితో దుర్యోధన ప్రతిమ ఏర్పాటు చేశారు. అక్కడ దుర్యోధన, భీముని వేషదారులు చేసిన యుద్ధ ఘట్టం రక్తి కట్టించింది. దుర్యోధుని వధ అనంతరం ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం, అనంతరం రాత్రి ద్రౌపది మాత అగ్నిప్రవేశం నిర్వహించారు. చివరిరోజు రాత్రి సాసవుల చిన్నమ్మకథ నాటకం నిర్వహించారు.

పోటాపోటీగా వేలం పాట



సంత గేటుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు గొర్రెల సంత, వారపు సంత గేటు వేలం పాటలు బుధవారం స్థానిక కార్యాలయంలో పోటాపోటీగా సాగాయి. ప్రతి శనివారం జరిగే గొర్రెల సంత గేటు వేలం రూ.22.36 లక్షలు పలికింది. తీవ్ర పోటీలో చింతపర్తికి చెందిన ద్వారకనాథరెడ్డి మరోసారి దక్కించుకున్నారు. అలాగే అంగళ్లు వారపు సంత గేటు వేలం పాట రూ. 5.51 లక్షలు పలికింది. మదనపల్లెకు చెందిన బాబా షరీఫ్ కొత్తగా పాడుకున్నారు. టమాటా మండీల గేటు వేలం పాట గతంలో కన్నా తక్కువకు పాడటంతో దీనిని తాత్కాలికంగా రద్దు చేసి మరో సారి నిర్వహించడానికి ఉన్నతాధికారుల అనుమతి కోసం ప్రతిపాదించినట్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి శేషగిరి కుమార్ తెలిపారు.

ప్రగతి కోసం కలసికట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

కురబలకోట : ప్రజల కోసం.. ప్రగతి కోసం కలసికట్టుగా పనిచేయాలని తంబళ్లపల్లె నియోజక వర్గ టీడీపీ నేత డి.జయచంద్రారెడ్డి కోరారు. బుధవారం కురబలకోటలో వివిధ శాఖల ఉద్యోగుల పరిచయ కార్యక్రమ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు కూటమికి అనూహ్య విజయాన్ని ఇచ్చారన్నారు. ఇందులో ఉద్యోగుల పాత్ర కూడా ఉందన్నారు. ఇందుకు పోస్టల్ బ్యాలెట్లే నిదర్శనమన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఉండబోవన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ వారితో శభాష్ అన్పించుకునేలా పనిచేద్దామని ఆకాంక్షించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సి ఉందన్నారు.

చేతుల పరిశుభ్రతతో డయేరియా నియంత్రణ

డాక్టర్ జులేఖ బేగం



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : చేతుల పరిశుభ్రతతో డయేరియా నియంత్రణ సాధ్యమని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ జులేఖ బేగం అన్నారు. బుధవారం చింతపర్తిలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వాతావరణంలో మార్పుల వలన వర్షాలు పడటం, మామిడి పండ్లు సీజన్ కావడంతో పరిసరాల పరిశుభ్రంగా లేకపోవడం వంటి కారణాల చేత క్రమంగా అతిసార కేసులు పెరుగుచున్నాయన్నారు. ప్రజలు నీటిని కాచి చల్లార్చి త్రాగడం, వ్యక్తిగత పరిశుభ్రత, క్లోరినేషన్ చేసిన నీటిని త్రాగడం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, భానుభి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నడివీధి గంగమ్మ జాతర



దీలు, బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నెహ్రూబజార్ నాలుగు రోడ్ల కూడలిలో నడివీధి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి దీలు,బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు. జాతర పురస్కరించుకుని దేవళంవీధి, నెహ్రూబజార్, శాస్త్రివీధి, అప్పారావువీధిలలో జాతర సందడి నెలకొంది. జాతర పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎంతో పేరుప్రతిష్టలు కలిగిన నడివీధి గంగమ్మ జాతర ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. జాతర సందర్భంగా స్థానిక ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం తరపున ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు అమర, బాలాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి సారె అందజేసి పూజలు నిర్వహించారు.

సికిల్‌సెల్ అనిమీయా వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కేవీపల్లె : సికిల్‌సెల్ అనిమీయా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ పరిధిలో మార్రేళ్ల, నూతనకాల్వలో సికిల్‌సెల్ అనిమీయా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ అనిమీయా వ్యాధిపై వారసత్వంగా వచ్చే ఎర్రరక్త కణాలకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధి అని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అనంతరం వైద్యసంరక్షణతో రోగి జీవన నాణ్యతను మెరుగుపరచుకోవచ్చునని తెలిపారు. సికిల్‌సెల్ అనిమీయా అంటే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఒళ్ళు నొప్పులు, కీళ్ళనొప్పులు, అలసట, కళ్ళు పసుపు రంగులోకి మారడం, లివర్ అవయవాల వైఫల్యం, గర్భదారణ సమయంలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రతిభ, నీలావతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు/కలికిరి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలికిరిలో ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ మాట్లాడారు. జూలై 1 నుంచి ఇంటి వద్దకే సామాజిక భద్రత పెన్షన్ అందజేస్తామని తెలిపారు. పెన్షన్ పెంచుతూ ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్, మే, జూన్ మూడు మాసాలతో కలిపి జూలై నెలలో లబ్ధిదారులకు రూ. 7 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆగస్టు నుంచి రూ. 4 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలోని పాఠశాలల్లో సుమారు 40 మంది ఉపాధ్యాయులు కొరత ఉన్నట్లు పేర్కొన్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత కారణంగా విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలకు, పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న , పిల్లలు లేని పాఠశాలల నుంచి మిగులుగా ఉన్న టీచర్లను అవసరమైన పాఠశాలలకు సర్దు బాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మిగులు ఉపాధ్యాయులను గుర్తించి అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేయాలని తెలిపారు. డివిజన్ కన్వీనర్ సుధాకర్, నాయకులు శీనప్ప, హరిక్రిష్ణ, గాలి రవీంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు